ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం | 16 నవంబరు, 2025 | పేజీలు :06


## ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని సన్మానించిన ఉద్యోగ సంఘాలు



**ప్రజాపక్షం/నిజామాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి(కలెక్టరేట్)కు శనివారం విచ్చేసిన బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డిని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా టీఎన్‌జీఓల సంఘం అధ్యక్షులు సుమన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రశాంత్, శ్రీనివాస్, ప్రభు, సతీష్ పాల్గొన్నారు.

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌ను తప్పనిసరిగా పాటించాలి

### ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ..




**ప్రజాపక్షం/నిర్మల్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ డిఫెన్సివ్ డ్రైవింగ్‌ను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్పష్టం చేశారు.గౌరవ రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి ఐపీఎస్ సూచనల ఆధారంగా,రోడ్డు ప్రమాదాల తగ్గింపులో డిఫెన్సివ్ డ్రైవింగ్ అత్యంత కీలకమని ఆమె తెలిపారు.రోడ్డుపై అప్రమత్తంగా ఉండటం,పరిసరాలను గమనించడం,ఇతరుల తప్పిదాలను ముందుగా అంచనా వేయడం మన ప్రాణాలను రక్షిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

**నిర్మల్ పోలీసులకు శిక్షణ ..**

నిర్మల్ పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు,ఎం.టీ డ్రైవర్లు,ఆర్ఐలు,ఆర్ఎస్ఐలకు డిఫెన్సివ్ డ్రైవింగ్ పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.ఇందులో భాగంగా ఈ రోజు జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం,ఆర్.ఐ.రామ్ నిరంజన్ రావ్ ఆధ్వర్యంలో నిర్మల్ ఎం.టీ పోలీస్ డ్రైవర్లకు డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ శిక్షణలో ఆర్.ఐలు శేఖర్,రామకృష్ణ,ఆర్.ఎస్.ఐలు సాయి కృష్ణ,రవి,మహేష్,వినోద్ సహా 31మంది ఎం.టీ డ్రైవర్లు పాల్గొన్నారు.

**డిఫెన్సివ్ డ్రైవింగ్ అంటే ఏమిటి..?**

ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ,ఇతర వాహనదారుల నిర్లక్ష్యం వల్ల సంభవించే ప్రమాదాల నుండి మనలను కాపాడుకునే జాగ్రత్తగా డ్రైవ్ చేసే విధానమే డిఫెన్సివ్ డ్రైవింగ్ అని ఎస్పీ వివరించారు.

**పాటించాల్సిన ప్రధాన నియ-మాలు..**

డిఫెన్సివ్ డ్రైవింగ్ లో భాగంగా తప్పు దారిలో వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించడం,మొబైల్ ఉపయోగించే డ్రైవర్లకు దూరంగా ఉండటం,రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాల డోర్లు అకస్మాత్తుగా తెరిచే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్తగా ఉండటం,సిగ్నల్ జంప్ చేసే వాహనాలను గమనించడం అకస్మిక బ్రేకింగ్ దూరంగా ఉండేందుకు వాహనానికి తగిన దూరం పాటించడం తప్పనిసరి అని నిర్మల్ పోలీసులు తెలిపారు.



## 108, 102 వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రజలకు సేవలందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీవీకే 108 అంబులెన్స్ ,102 అమ్మ ఒడి వాహనాలను జగిత్యాల జిల్లా మేనేజర్ యశోద ఐలయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్ లోని వైద్య పరికరాల పనితీరును పరిశీలించారు .అంబులెన్స్ లో మెడిసిన్స్ ,మెడికల్ ఎక్విప్మెంట్స్ రికార్డులను తనిఖీ చేసి ఎటువంటి రిమార్క్ లేకుండా వ్యవహరించాలని తెలియజేశారు .ఫోన్ కాల్ వచ్చిన వెంటనే స్పందించి సంఘటన జరిగిన స్థలానికి వీలైనంత త్వరగా చేరుకొని వారికి ప్రథమ చికిత్స చేస్తూ దగ్గరలో ఉన్నటువంటి హాస్పిటల్ కి చేర్చాలని సిబ్బందికి తగిన సూచనలు చేశారు.ఈ నెలలో ఎక్కువగా అస్తమా చాతి నొప్పి కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నందున వాహనంలో నిత్యం ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు . క్షేత్ర గాత్రులకు వేగవంతమైన వైద్య సేవలు అందించడం పై దృష్టి పెట్టాలని సూచించారు.అమ్మ ఒడి వాహనం ద్వారా గర్భిణీలను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల కేంద్రంలో 108,102 సిబ్బంది చూపుతున్న కృషి పై జిల్లా మేనేజర్ యశోద ఐలయ్య సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో ఈ ఎం టీ. గిరిబాబు, జుంజు పెల్లి అరుణ్, పైలెట్ అశోక్ పాల్గొన్నారు.

## 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** నవంబర్ 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సహకార సంస్థల ద్వారా ఆత్మనిర్భర్ భారత్ అనే నినాదంతో సహకార వారోత్సవాలు వారం రోజుల పాటు ఒక్కో అంశంతో నిర్వహించబడతాయని తెలిపారు. నవంబర్ 14న కార్యకలాపాల సామర్థ్యం, బాధ్యత, పారదర్శకతను పెంపొందించడానికి డిజిటలైజేషన్ ప్రోత్సాహం, నవంబర్15న త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయం పరిశోధన, శిక్షణ ద్వారా సహకార విద్య పరివర్తన నిర్వహిస్తామని అన్నారు. నవంబర్ 16న సహకార సంఘాల ద్వారా గ్రామీణాభివృద్ధిని బలోపేతం చేయడం నవంబర్17న భారతదేశ సహకార సంస్థలకు జాతీయ సహకార విధాన వ్యవస్థ, నిర్మాణాత్మక ఆచరణ ఉంటుందని తెలిపారు.నవంబర్18న సహకార వ్యవస్థాపకత ద్వారా హస్తకళలు, చేనేత, కార్మిక, మత్స్య సంపదతో సహా యువత, మహిళలు బలహీన వర్గాల సాధికారత సాధించాలని అన్నారు. నవంబర్ 19న టూరిజం, ఆరోగ్యం, గ్రీన్ ఎనర్జీ రంగాలలో సహకార సంస్థలుకిచెన్ వంటి కొత్త రంగాల్లో సహకార సంఘాల విస్తరణ, నవంబర్ 20న ప్రపంచ పోటీ శక్తికి అనుగుణంగా సహకార వ్యాపార నమూనాలలో ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, సహకార సంఘం, తిరుమల ఆయిల్ కేం ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారంఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది . ఆయిల్ పామ్ పంట ఉద్యాన శాఖ అధికారులు పంట గురించి నాటే విధానం, నీటి వినియోగం, సస్య రక్షణ విధానాల ను రైతులకి వివరించారు.ఆయిల్ పామ్ రైతులకి లాభదాయకంగా ఉంటుందని వివరించారు. రైతులందరూ ఆయిల్ పామ్ పంట సాగు వైపుకు మొగ్గ చూపాలని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ యాదగిరి రావు, సురేందర్ రెడ్డి, సీఈవో ప్రసాద్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి అనూష, మండల విస్తరణ అధికారులు సౌమ్య, హారిక, శ్రీలేఖ, హెచ్.ఇ.ఓ రాజ శేఖర్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్ తో పాటు రైతులు పాల్గొన్నారు.




## కిష్టాగౌడ్‌కు ఘన నివాళులు అర్పించిన సిపిఎం నాయకులు



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ కార్యకర్త కిష్టాగౌడ్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన అంతిమ సంస్కారాలు బోధన్ పట్టణంలోని గంజి పట్టణంలోని గంజి ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు కిష్టాగౌడ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. గంగాధరప్ప. వెంకట్ రాములు, బోధన్ ఏరియా నాయకులు శంకర్ గౌడ్, గంగాధర్, జిల్లా నాయకులు వెంకటేష్, సుజాత తదితరులు పాల్గొని ఆయన భౌతిక కాయపై పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కిష్టాగౌడ్ విద్యార్థి దశ నుంచే అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొని పార్టీ క్రమశిక్షణతో నిబద్ధతగా పని చేస్తూ పార్టీ నిర్ణయాలను అమలు జరపడంతో పాటు పార్టీ అభివృద్ధికి ప్రాంతంలో ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రజల కోసం పరితపించే వ్యక్తి తమ కుటుంబ సమస్యల కన్నా ప్రజా సమస్యలే భావిస్తూ పనిచేసే నిబద్ధత కలిగిన కార్యకర్తను పార్టీ కోల్పోయిందని అన్నారు. జిల్లా కార్యదర్శి రమేష్ బాబు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. అనంతరం కిష్టాగౌడ్ అంతిమయాత్రలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారమిత వరల్డ్ స్కూల్‌లో డిజిటల్ లిటరసీ, ఆర్ట్ ఎగ్జిబిషన్




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** బాలల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన డిజిటల్ లిటరసీ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ పూర్తయ్యింది. సుమారు 200 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులే తమ స్వతంత్ర ప్రతిభతో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మీడియా వంటి ఆధునిక అంశాలను విద్యార్థులు మోడల్స్, పోస్టర్లు రూపంలో ఆకర్షణీయంగా ఆవిష్కరించారు. అదే విధంగా విద్యార్థుల సృజనాత్మకత, కళాత్మక చాతుర్యాన్ని ప్రతిఫలించే వివిధ రకాల చిత్రాలు, చిత్రకళాకృతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇవి తల్లిదండ్రులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పారమిత పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు విద్యార్థుల ప్రతిబను అభినందిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రసూన, వియుఎం ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్, ఆర్ట్ టీచర్ చిరంజీవి చారి, కంప్యూటర్ ఉపాధ్యాయులు ఎ.సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జన్మదిన వేడుకలు నగర కాంగ్రెస్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుడిగా పలు శాఖలకు మంత్రిగా కొనసాగుతూ నిరంతరం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకులు తుమ్మల నాగేశ్వర్‌రావు అని కొనియాడారు. ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, లాయక్, దండి రవీందర్, అబ్దుల్ రహమాన్, షబానా మహమ్మద్, అస్థాపురం రమేష్, నాగుల సతీష్, మిరాజ్, మాసుం ఖాన్, ఆంజనేయులు, భారీ, బషీర్, ఖలీల్, నదీమ్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

## పొలంబాట




**ప్రజాపక్షం/బాల్కొండ:**మండలంలోనికి సాన్‌నగర్ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల వద్ద రై తుపొలంబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు రైతులకు పలు భద్రత సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సుందర్రావు, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, లైన్‌మెన్లు నవీన్, లక్ష్మ ణ్, మల్లేష్, గణపతి, సత్యం, సోమయ్య రైతులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో మానసిక బలహీనతలు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని అన్ని గ్రామాలలోని గ్రామ పంచాయతీలు ప్రభుత్వ పాఠశాలలో శనివారం రోజున బాల్యవివాహాల పై అవగాహన కార్యక్రమం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో( జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, చైల్డ్ హెల్ప్ లైన్ విభాగం, సఖి వన్ స్టాప్ సెంటర్ విభాగల నుండి ఉద్యోగులు) చేపట్టడం జరిగింది. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, చైల్డ్ హెల్ప్ లైన్ విభాగం, సఖి వన్ స్టాప్ సెంటర్ విభాగల నుండి ఉద్యోగులు మాట్లాడుతూ జగిత్యాల మండలంలోని జగిత్యాల రూరల్ అన్ని గ్రామ పంచాయతీలు మరియు పాఠశాలల్లో బాల్య వివాహాల పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల్లోని విద్యార్థులకి అవగాహన కార్యక్రమం కల్పించి వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల అమ్మాయిలు మానసికంగా బలహీనపడతారన్నారు. బాల్య వివాహాల వల్ల శారీరకంగా జరిగే అనర్థాల పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి వివరించి గ్రామాలలో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి తెలియజేయాలని టోల్ ఫ్రీ నెంబర్స్ 181, 14567, 1930, పోక్సో చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సూపర్వైజర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు, పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లులు, ఆశా కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు, మహిళా సంఘం నాయకులు, కిశోర బాలికలు, మహిళలు, పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా వాయిల రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన వాయిల రాజ్ కుమార్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్‌లు నియమించారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. అనంతరం వాయిల రాజ్ కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బిసి సంక్షేమ, అనుబంధ సంఘ నాయకులు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేవారు. బిసి సంక్షేమ సంఘం అభివృద్ధికి, బిసిల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, బిసి పథకాలు ఎలా అమలు చేసుకోవాలని ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తూ పోరాటాలకు సంసిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.

## ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా జయంతి వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం వేడుకలు నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు.ఇక్కడ డీటీడబ్ల్యూఓ సంగీత, ఏఓ రాంరెడ్డి, డీఎం డబ్ల్యూఓ భారతి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ఎల్డీఎం మల్లికార్జున రావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి 1,50,000 విరాళం అందజేత

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దొడ్డ సమ్మయ్య శ్రీదేవి దంపతులు (ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ సోదరుడు) అడవి శ్రీరాంపూర్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ కోదండ రామాలయం, అయ్యప్ప స్వామి దేవాలయానికి 1,50,000 ఒక లక్ష యాభై వేల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారి కుటుంబానికి ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ ఇంత విరాళం ఇచ్చినందుకు వారి కుటుంబానికి గ్రామస్తులు ఆలయ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

## కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్ లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుకు జగిత్యాల రూరల్ మండల విద్యాధికారి దరఖాస్తులను కోసం ఆహ్వానించారు. దానికి సంబంధించిన అర్హతలు, వివారాలు ఇంటర్మీడియట్ లో 45%, ఏఎన్ఎం ట్రైనింగ్ లో 45%, అదనపు అర్హతలు జి.ఎన్.ఎం ట్రైనింగ్ 5 మార్క్స్, బిఎస్సి నర్సింగ్ ట్రైనింగ్ 10 మార్క్స్ పై అర్హతలు ఆసక్తి గలవారు జగిత్యాల కేజీబీవీ ఈ నెల 18 వ తేదీ మంగళవారం లోపల అప్లై చేసుకోగలరని జగిత్యాల రూరల్ మండల విద్యాధికారి పత్రిక ప్రకటనలో తెలిపారు.

# నెహ్రూకు పిల్లలన్నా... గులాబీలన్నా ఇష్టం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని అశోక్ నగర్ సెలెస్టియల్ హైస్కూల్లో కస్పాండెంట్ రాధాకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల కరస్పాండెంట్ గా నిక్షిత రెడ్డి, ప్రిన్సిపాల్ గా దీక్షిత, పిఈటీలుగా సాత్విక్, అద్విత్, శశాంక్ లు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో




భాగంగా వివిధ పాటలపై విద్యార్థినీ విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిన్ననాటి నుండే చురుకైన విద్యార్థిగా ఉంటూ ఉన్నత చదువులు చదివి, భారత జాతీయ ఉద్యమంలో పాల్గొని భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత భారతదేశ మొదటి ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపాడన్నారు. నెహ్రూకు పిల్లలన్న గులాబీలన్న చాలా ఇష్టమన్నారు. అందుకే చాచా నెహ్రూ జన్మదినాన్ని భారత ప్రభుత్వం చిల్డ్రన్స్ డే గా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మచ్చ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ బి.రజిత, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపుతో కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గిందంటూ వస్తున్న ఆరోపణలకు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపొందిన నవీన్ యాదవ్ గెలుపు ప్రతిపక్ష పార్టీలకు చెంప పెట్టు లాంటిదని సిర్పూర్ మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును హర్షిస్తూ బాపురెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టారని అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నవీన్ యాదవ్ ఎన్నిక సులువైందన్నారు. గెలుపుకై కృషి చేసిన ప్రతి కార్యకర్త నవీన్ యాదవ్ గెలుపుతో రెట్టింపు ఉత్సాహం పొందారని కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ నల్ల శ్రీనివాస్,నాయకులు సోమ నాగార్జున రెడ్డి మాధవరెడ్డి, యువ నాయకులు,తదితరులు ఉన్నారు

## ఎపిహెచ్ఆర్‌సి జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా కళ్యాణ్

**ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్ :** ఎపిహెచ్ఆర్‌సి చైర్మన్ అండ్ ఫౌండర్,జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి నడిమింటి చంద్రకళా రెడ్డి ఆదేశాల మేరకు అసోసియేషన్ ఫర్ పీపుల్ ఫర్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ పెద్దపల్లి జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా సిలారపు కళ్యాణ్ ను నియమించినట్లు ఏపీహెచ్ఆర్సి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ తక్ధీర్ ఆలీ ప్రకటించారు. కళ్యాణ్ చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన అసోసియేషన్, ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా సిలారపు కళ్యాణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ, వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అసోసియేషన్ను అంచలంచెలుగా బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రజల కష్టనష్టాలను, సమస్యలను తెలుసుకుని, వాటిని అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర కార్యవర్గం సహకారంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు తక్ధీర్ ఆలీకి,జాతీయ అధ్యక్షురాలు నడిమింటి చంద్రకళా రెడ్డికి,ఇతర రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులకు, అసోసియేషన్ నేతలకు కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సిలారపు కళ్యాణ్ కు పలువురు కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## గాయత్రి స్కూల్ విద్యార్థుల జకోటియా కవర్ ఫ్యాక్టరీ సందర్శనం



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** గాయత్రి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు జకోటియా కవర్ ఫ్యాక్టరీని సందర్శించి పరిశ్రమలకు అవసరమైన కవర్ల తయారీ విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. అల్ట్రాటెక్ వంటి సంస్థల కోసం తయారు చేసే కవర్లు, రైస్ బ్యాగులు, అలాగే వివిధ రకాల ఇండస్ట్రియల్ కవర్లు ఎలా రూపుదిద్దుకుంటాయో పిల్లలు ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పరిశ్రమ దర్శనంలో భాగంగా విద్యార్థులు ముడి పదార్థాల వాడకం, కటింగ్, ప్రింటింగ్, స్టిచింగ్, లామినేషన్, చివరి దశ ప్యాకింగ్ వంటి మొత్తం తయారీ ప్రక్రియను నిశితంగా గమనించారు. ఫ్యాక్టరీ సిబ్బంది విద్యార్థులకు యంత్రాల పని విధానం మరియు ఉత్పత్తి నాణ్యత నియంత్రణపై వివరించారు.ఈ సందర్శనం ద్వారా విద్యార్థులు పాఠ్యపుస్తకాలకతీతంగా ప్రాయోగిక జ్ఞానం పొందడం విశేషం. పరిశ్రమల పని తీరు, ఉత్పత్తి దశలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంపొందించడంలో ఈ ఫ్యాక్టరీ ట్రిప్ ఎంతో ఉపయోగపడిందని ఉపాధ్యాయులు తెలిపారు.గాయత్రి విద్యానికేతన్ స్కూల్ నిర్వహించిన ఈ విద్యా యాత్ర విద్యార్థుల్లో పరిశ్రమలపై ఆసక్తిని పెంచింది.

## టాస్క్ సెంటర్ లోతొమ్మిది మంది విద్యార్థినులకు ఉద్యోగాలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ప్రభుత్వం స్థాపించిన (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నోలెడ్జ్) రీజినల్ సెంటర్ పెద్దపల్లి, జిల్లా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఉద్యోగ అవకాశాలను అందిస్తూ ప్రశంసలు అందుకుంటోంది. వివిధ కోర్సులలో శిక్షణ పొందిన యువత ప్రముఖ సంస్థల్లో నియామకాలు పొందడం వరుసగా కొనసాగుతోంది.ఇటీవల టాస్క్ శిక్షణలో భాగమై ఇంటర్వ్యూలకు హాజరైన తొమ్మిది మంది విద్యార్థులు, టెలిపర్ఫార్మెన్స్ సంస్థలో హోదాలో ఎంపిక కావడం విశేషం. వీరిని YouTube ప్రాజెక్ట్‌లో నియమించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. టాస్క్ పెద్దపల్లి కేంద్రంలో అందించే శిక్షణా కార్యక్రమాలు యువతకు ఉద్యోగ అవకాశాలకు దారి తీసే వంతెనగా నిలుస్తున్నాయి. టాస్క సెంటర్‌లో కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ & సాఫ్ట్ స్కిల్స్, పరిశ్రమలకు అనుగుణమైన ఉద్యోగ కోర్సులు,కెరీర్ గైడెన్స్ వంటి అనేక కార్యక్రమాలు అందిస్తున్నారు.ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులు ఈ కేంద్రం ద్వారా లబ్ధి పొందుతున్నారు. టాస్క్ కేంద్ర ప్రతినిధులు మాట్లాడుతూ,జిల్లా యువత తమ కృషితో మంచి సంస్థల్లో ఉద్యోగాలు పొందడం ఆనందం కలిగిస్తోంది. ఇంకా ఎక్కువ మందికి శిక్షణ అందించి, వారిని ఉద్యోగ అవకాశాలకు దారి తీసేందుకు కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు.పెద్దపల్లి జిల్లా యువతకు టాస్క్ రీజినల్ సెంటర్ ఆదర్శవంతమైన వేదికగా ఎదుగుతోంది.ఈ సెంటర్ సాయంతో ఉద్యోగాలు పొందుతున్న విద్యార్థులు, ప్రాంతీయంగా టాస్క్ ప్రభావాన్ని మరింత బలపరుస్తున్నారు.ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు.

## తక్ధీర్ అలీకి సితార విశిష్ట సేవా రత్న పురస్కారం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లాకు చెందిన అసోసియేషన్ పీపుల్ ఫర్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ తక్ధీర్ అలీ సితార విశిష్ట సేవ రత్న పురస్కారాన్ని అందుకున్నారు.నెల్లూరులో సితార ఎంటర్టైన్మెంట్స్, ఏపీహెచ్ఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ద్వితీయ వార్షికోత్సవంలో సితార ఎంటర్టైన్మెంట్ అసోసియేషన్ అధినేత కుమార్, ఏపీహెచ్ఆర్‌సీ చైర్మన్ నడిమింటి చంద్రకళా రెడ్డి చేతుల



మీదుగా ఈ అవార్డును అందించారు.తెలంగాణ రాష్ట్రంలో పేద,బడుగు,బలహీన వర్గాల కోసం, ముఖ్యంగా మహిళా సమస్యల పరిష్కారానికి తక్ధీర్ అలీ చేస్తున్న నిరంతర సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా తక్ధీర్ అలీ తన సేవలను గుర్తించి సేవారత్న పురస్కారాన్ని అందించిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డు ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కుమార్,నడిమింటి చంద్రకళా రెడ్డి,తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ గోవిందరాజుల స్వామి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, భాగవతారిని నాగరత్నమ్మ,25 కళా సంఘాల అధినేత అమరావతి కృష్ణారెడ్డి,పలువురు ప్రముఖులు, వక్తలు,అసోసియేషన్ నేతలు,సభ్యులు తక్ధీర్ అలీని అవార్డుతో పాటు పుష్పగుచ్ఛాలని అందజేసి శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు.తక్ధీర్ అలీ మరెన్నో అవార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

## నేటి పిల్లలే రేపటి బావి భారత పౌరులు




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** భారతదేశ మొట్టమొదటి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు 14 నవంబర్ 1889 ను బాలల దినోత్సవంగా జరుపుకుంటారని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ నాగుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం బాలల దినోత్సవం సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సుమారు 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల కరస్పాండెంట్ గా వివేక్ ప్రిన్సిపాల్ గా నిహారిక విధులు నిర్వర్తించారు.ఈ సందర్భంగా కరెస్పాండెంట్ నాగుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి బావి భారత పౌరులని దేశానికి దశా దిశా నిర్ణయించేటువంటి శక్తి సామర్థ్యాలు పిల్లలలో ఉన్నాయని అన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ శాస్త్రీయ రంగాల్లో వినూత్నమైన మార్పులను అవగతం చేసుకుంటూ అబ్దుల్ కలాం ఆశించిన కలలను సాకారం చేస్తూ భారతదేశానికి గర్వకారణంగా నిలువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## భీమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

**ప్రజాపక్షం/వేములవాడ :** శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం ముగుస్తున్న సందర్భంగా భారీగా భక్తులు తరలి వస్తున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పలు చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో రమాదేవి, పట్టణ సీఐ వీర ప్రసాద్ తో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కోడె క్యూలైన్, ఉచిత దర్శనం, మూడు వందల ప్రత్యేక దర్శనం, లడ్డు కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్ వంటి ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే విషయంపై అధికారులు పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎల్లా గౌడ్, డి.ఈ. రఘునందన్, ఏ.ఈ.ఓ శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

**ప్రజాపక్షం/ధర్మపురి :** రాజీమార్గమే రాజ మార్గమని, ఒక కేసులో రాజీ పడటం వల్ల ఇరువర్గాలు ఆ కేసులో గెలిచినట్లేనని ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి యోగి జానకి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా సివిల్ కేసులు 2, క్రిమినల్ కేసులు 41, పెట్టి కేసులు 280 పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎజిపి ఇమ్మడి శ్రీనివాస్,న్యాయవాదులుబందెల రమేష్, మామిడాల శ్రీకాంత్, గడ్డం సత్యనారాయణ, రౌతు రాజేష్, రామడుగు రాజేష్ , దుమ్మెన శ్రీనివాస్,జాజాల రమేష్, గూడ జితేందర్ రెడ్డి, కలమడుగు కీర్తి , ప్రవలిక కస్తూరి శరత్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి సరే తులం బంగారం ఎక్కడ

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాల సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అబద్దపు హామీల ఇచ్చి నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని, గత ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన కళ్యాణ లక్ష్మి పథకానికి రెట్టింపుగా తులం బంగారం ఇస్తామని చెప్పి నేటి వరకు అమలు చేయలేదని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరిన్ని అబద్ధపు హామీలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ప్రజలు గమనించాలని సూచించారు. కాగా 40 మంది లబ్ధిదారులకు మంజూరైన 40 లక్షల 4600 విలువైన కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమేష్, ఆర్ ఐ రాజేష్,వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కోసం రైతన్న ఎదురుచూపులు



ప్రజాపక్షం/ముధోల్ : రబీ సీజన్ ప్రారంభమైనందున రైతులు విత్తనాలు విత్తుకుంటున్నారు.రైతులకు గత ఖరీఫ్ సీజన్ ప్రతికూల పరిస్థితులతో నష్టం చేకూరింది.ఎన్నో ఎకరాల్లో పంట నీటి పాలవడంతో రైతు కంట కన్నీరు మిగిలింది.కొన్ని పంట పొలాలు వరద ప్రభావానికి లోను కాకున్నా వాతావరణ ప్రతికూల పరిస్థితులతో వచ్చిన దిగుబడి పెట్టుబడివ కంటే తక్కువగా వచ్చింది.మండలంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో దాదాపు పంటలు నేలమట్టమై ప్రతి రైతుకు తీరని నష్టం చేకూర్చాయి.అదే నష్టం నుండి తేరుకుందామన్న రైతుకు గత కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షం సైతం భరించలేని దెబ్బకొట్టినట్లయింది.రబీ పంట కోసం చదును చేసుకున్న రైతులకు వ ర్షం కురవడంతో రైతులకు మరింత ఆందోళన పెరిగింది.ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు నేటి పరిహారం అందలేదు.పంటల మీదే ఆధారపడ్డ రైతులకు నష్టం వాటిల్లిన ముందుకు సాగకుండ్ ఆగే పరిస్థితి ఉండదు.ఇప్పటికే రబీ పంట వేయడానికి సమ యం మించిపోయింది.అయినా రైతుల వద్ద పెట్టుబడి లేకపోయినా అప్పులు చేసి భూములు చదును చేసుకుని విత్తనాలు విత్తుకున్నారు.పంట నష్ట పరిహారం అందకపోయినా కనీసం పెట్టుబడి సహాయం అయిన రైతు భరోసానైనా వస్తుందేమోనని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.ఇప్పటికే ప్రభుత్వం రైతు భరోసా విడుదల చేయడంలో ఆలసయం చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారుప.రైతన్నకు ఇప్పటికైనా రైతు భరోసాను అందించి ప్రభుత్వం బాసటగా నిలవాలని వేడుకుంటున్నారు.

## విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి



ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండలంలోని లక్కంపూడి గ్రామంలో కుప్టీ ఫీడర్ 11 కేవి విద్యుత్ లైన్ తెగిపడి రైతు సురుసే గోవిందరావు,కు చెందిన ఎద్దు మృత్యువాత చెందింది దీని ధర 80 వేల వరకు ఉంటుందని రైతు వీలపిస్తూ చెప్పాడు,ఆరుగాలం పంట పనులకు ఉపయోగించుకునే ఎద్లు చనిపోవడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటూ ఇప్పుడెలా పనులు చేసుకునేదని అధికారులకు మొరపట్టుకుంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ కరెంట్ అధికారులు స్పందించి తగిన ఎక్స్గ్రేషి చెలించాలని ఇటువంటివి పునారావృత్తం కాకుండా చూడాలని గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## కుక్క కరిచిన కేసుల్లో ప్రత్యేక పర్యవేక్షణ అవసరం

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కుక్క, కోతి కరిచిన వారికి చికిత్స పట్ల ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హౌజింగ్‌బోర్డు కాలనీలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శనివారం సందర్శించారు. చికిత్స కోసం వచ్చిన పలువురు వృద్ధులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలకు విటమిన్, ఐరన్, కాల్షియం మాత్రలను పంపిణీ చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కుక్క, కోతి కరిచిన వారిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని, క్రమం తప్పకుండా చికిత్స అందిస్తూ కోర్సు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. చిన్నారుల నెలవారీ టీకాలు, గర్భిణీల నాలుగు ఆరోగ్య పరీక్షలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు, ఇతర వైద్య సేవలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు.

### విటమిన్ గార్డెన్‌పై దృష్టి పెట్టాలి

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విటమిన్ గార్డెన్లపై బయోసైన్స్ ఉపాధ్యాయులపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. హౌజింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు.

## నిర్మల్‌లో సాఫ్ట్‌బాల్,నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

### రాష్ట్రస్థాయి పోటీలకు 28 మంది ఎంపిక..



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం అండర్17 బాలురు,బాలికల సాఫ్ట్‌బాల్,నెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు.ఈ ఎంపికలకు వివిధ పాఠశాలల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ పోటీలలో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిలో నుండి సాఫ్ట్‌బాల్‌కి 16 మంది(బాలురు,బాలికలు కలిపి) నెట్‌బాల్‌కి 12 మంది(బాలురు,బాలికలు కలిపి)చొప్పున మొత్తం 28 మంది క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగింది.ఎంపికైనా ఈ క్రీడాకారులు నిర్మల్ జిల్లా తరపున రాష్ట్రస్థాయిలో నెట్‌బాల్ పోటీలు నవంబర్ 17న ఆదిలాబాద్ జిల్లా సోనాలలో,అలాగే సాఫ్‌బాల్ పోటీలు నవంబర్ 18న బజార్‌హత్నూర్‌లో నిర్వహించనున్నారు.ఈ ఎంపిక ప్రక్రియలో ఎస్.జి.ఎఫ్ సెక్రెటరీ రవీందర్ గౌడ్,కన్వీనర్ అన్నపూర్ణ,సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రమణారావు,మహిళా ఉపాధ్యాయులు అనిత రాథోడ్,సంజు రాథోడ్,ఆర్గనైజర్ సంజీవ్,గస్కంటి గంగాధర్,వ్యాయామ ఉపాధ్యాయులు గరి,ముఖేష్,హనుమాన్లు,అలహాస్, సతీష్,భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్నిక జన్మదిన వేడుకలకు విద్యార్థుల కోసం బస్సు బుక్ చేసిన తండ్రి




ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : సాధారణంగా తమ పిల్లల పుట్టినరోజు వేడుకలను ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లి దండ్రులు కార్లలో తిప్పుతూ ఘనంగా జరుగుతుంటారు.కానీ,నిర్మల్ జిల్లా అక్కాపూర్ నివాసి అయిన నాగుల మారుతి రెడ్డి మాత్రం అందుకు భిన్నంగా తన కుమార్తె పుట్టిన రోజును పేద విద్యార్థులకు సంతోషాన్ని పంచడం ద్వారా వినూత్నంగా జరిపారు.ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో శనివారం అప్ అండ్ డౌన్ రూ.300కే బాసర టూర్ ప్యాకేజ్ బస్సును ప్రకటించారు.ఈ క్రమంలో,మారుతి రెడ్డి తన కుమార్తె ఆర్నిక పట్టిన రోజు అయిన నవంబర్ 15వ తేదీన,ఆ బస్సులోని మొత్తం 55 సీట్లను తానే బుక్ చేసుకున్నారు.అక్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులను ఎంపిక చేసి,వారిని బాసర పుణ్య క్షేత్రానికి ఉచితంగా పంపారు.ఈ సందర్భంగా ఆర్నిక తండ్రి మారుతి రెడ్డి మాట్లాడుతూ,ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పిల్లలను వారి తల్లిదండ్రులు కార్లలో తిప్పుతారని,కానీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో చాలామంది పేదవారు ఉంటారనే ఉద్దేశంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.తన కూతురు ఆర్నిక పుట్టినరోజులు ఇంకా ఎన్నో జరుపుకోవాలని,ఆమఎ ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని పలువురు పిల్లలు పెద్దలు దీవించారు.ఒకేసారి టూర్ ప్యాకేజీని మొత్తం బుక్ చేసుకున్న మారుతి రెడ్డిని డిపో మేనేజర్ కే.పండరి అభినందించారు.మారుతి రెడ్డిని స్పూర్తిగా తీసుకొని ఎవరైనా దాతలు అనాథ పిల్లలకు లేదా పేద విద్యార్థులకు ఇలాంటి యాత్రలు చూపించడానికి ముందుకు రావాలని డిపో మేనేజర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/దిలావర్పూర్ : మండల కేంద్రంలోని ప్ర భుత్వ జూనియర్ కళాశాలలో శనివారం రోజున ఎన్.ఎస్.ఎస్.యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సయ్యద్ ఖలీం ముఖ్య వక్తగా హాజరయ్యారు.సయ్యద్ ఖలీం మాట్లాడుతూ,ఆర్.టి.ఐ ద్వారా పరిపాలనలో పారదర్శకత,జవాబుదారీతనం సాధించవచ్చని తెలిపారు.ప్రభుత్వ పథకాల నిధులు,వాటి వినియోగం,లబ్ధిదారుల వివరాలు,ప్రభుత్వ నిర్మాణ పనుల నాణ్యత,స్థానిక సంస్థల పనితీరు వంటి అంశాలపై సమాచారం కోరడం ద్వారా దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని ఆయన వివరించారు.ఈ చట్టాన్ని సక్రమంగా వినియోగించి ప్రతి పౌరుడు పరిపాలనలో భాగస్వామి కావాలని ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.సుదర్శన్,ప్రోగ్రాం ఆఫీసర్ మాలెపు కృష్ణ,ఇతర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర స్వామి కల్యాణానికి నిజామాబాద్ ఎమ్మెల్యే హాజరు



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంగ రంగ వైభవంగా జరిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి నిజామాబాద్ బీజేపీ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన ఈ వేడుకలను ఎమ్మెల్యే తిలకించారు.ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్,ఎమ్మెల్యే,ధన్‌పాల్‌ను మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో ఆగమ శాస్త్రం ప్రకారం సంప్రదాయ పూజారులు వేద మాంత్రోచ్ఛారణల మధ్య కన్యాధానం,మంగళసూత్ర ధారణ వంటి వివాహ ఆచారాలను నిర్వహిస్తారని తెలిపారు.ఈ వేడుక భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందని పేర్కొన్నారు.భక్తులు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో జరిగే ఈ కళ్యాణోత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన ఆకాంక్షించారు.

## విద్యాభివృద్ధి లక్ష్యంగా ముందుకు

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజాపక్షం/బైంసా : విద్యాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వెల్లడించారు.బైంసా మండలంలోని వానలుపాడ్ గ్రామంలో జడ్పీ హైస్కూల్లో ఉపాధి హామీ నిధులు 12 లక్షల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామస్తులు సహకరించాలన్నారు.పాఠశాలల అదనపు గదుల నిర్మాణానికి తాను నిధులు ఇవ్వడానికి సిద్ధమేనని,సంఖ్యను పెంచాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు.విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి,సాధించగలుగుతామని,మరింత మెరుగైన విద్యను ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.తాను ఒక రైతు బిడ్డనేనని ఈ స్థాయికి రావడానికి విద్యనేనని,తల్లిదండ్రులను,గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దని అన్నారు.ఈ సందర్భంగా వానల పాడ్ గ్రామస్తులు పలు సమస్యలను విన్నవించగా,దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద రావ్ పటేల్,తహసిల్దార్ ప్రవీణ్ కు మార్,ఎంపీడీవో నీరజ్,ఎంపీఓ జాదవ్ ప్రదీప్,సీనియర్ నాయకు లు సోలంకి భీమ్రావు,గౌర శ్రీనివాస్,గణేస్ పటేల్,బైంసా మం డల బిజెపి అధ్యక్షురాలు సిరం సుష్మ రెడ్డి,స్థానిక నాయకులు చందర్ పటేల్,సాయరెడ్డి,సీనియర్ అడ్వకేట్ గంగాధర్,మాజీ సర్పంచులు రాము,ముత్యం రెడ్డి,ఆయా గ్రామాల బిజెపి నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎస్‌సి విద్యార్థులను ఉన్నత విద్య దిశగా ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** షెడ్యూల్డ్ కులముల (ఎస్‌సి) విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ప్రోత్సహించాలని జాతీయ కమిషన్, సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ సభ్యులు వడ్డేపల్లి రామచందర్, లవ్ కుశ్ కుమార్ అన్నారు. శనివారం అధికారిక పర్యటనలో భాగంగా వారు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) సురేష్ కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సత్యజిత్ మండల్ లతో కలిసి జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించారు. అనంతరం ఎస్ సి విద్యార్థుల సంక్షేమం, వసతి గృహ సదుపాయాలు, విద్యా ప్రమాణాలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జాతీయ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ఎస్‌సి విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. దళిత అణగారిన వర్గాల సంక్షేమం కోసం కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ షెడ్యూల్డ్ కులాల కమిషన్ కు విశేష అధికారాలను అందించారని, తద్వారా అణగారిన వర్గాలకు ఎలాంటి అన్యాయం జరిగిన కమిషన్ సత్వరమే స్పందించి దళితుల పక్షాన అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రగతి స్టేడియం 33 వసంతాల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ప్రాంతంలోని ప్రగతి స్టేడియం ఏర్పడి 33 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30న ఆదివారం రోజున క్రీడాకారులు, అధికారులు, కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం జరుగుతుందని కో ఆర్డినేటర్ గూడూరి యాదిరెడ్డి తెలిపారు. శనివారం శ్రీరాంపూర్, నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 1992వ సంవత్సరంలో ప్రగతి స్టేడియం ఏర్పడిందని, అప్పటి జిఎం సత్యనారాయణ ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు. సింగరేణిలో మొట్టమొదటిసారిగా ఆత్మీయ సమ్మేళనం, అలాయ్ బలాయ్ కార్యక్రమం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సంస్థ చైర్మన్ కం మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) బలరాం, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ భాస్కర్ లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమ్మేళనం నిర్వహణ కమిటీ చైర్మన్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రమయే పూజ్యతే అనే నినాదంతో ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ నుండి 300 మందితో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజేతలు, కళాకారులు, జిఎంలు, పాత్రికేయులను సత్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం నిర్వహణ కమిటీ కో కన్వీనర్ ఈసంపల్లి రామచందర్, ఉపాధ్యక్షులు మల్లెత్తుల రాజేంద్రపాణి, కోశాధికారి ఎద్దు సదయ్య, భాను ప్రసాద్, మీడియా ఇంచార్జి భాస్కరి రాజేశం తో కలిసి సమ్మేళనం వాల్ పోస్టర్ విడుదల చేశారు. 300 మంది వివరాలతో కూడిన సావనీరు విడుదల చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు రాళ్ల బండి రాజన్న, శ్యాంసుందర్, గజ్జెల్లి రాజలింగు, కృష్ణ, పుల్లయ్య, శ్రీనివాస్, మైసూర్, శేషగిరి, కాశీ సతీష్, మహేందర్, కార్తీక్, ఉపేందర్ పాల్గొన్నారు.




# ఘనం బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం / కాసిపేట :** గిరిజన హక్కుల కోసం పోరాడిన ఆదివాసి వీరుడు బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని శనివారం కాసిపేట మండలంలోని కొండాపూర్ (యాప) వద్ద ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో చిత్రపటం ఉన్న ఏకైక గిరిజన నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. ఆయన ధైర్యం, దేశభక్తి, గిరిజన సంస్కృతికి చేసిన సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. బిర్సా ముండా జీవితం గురించి జన జాతీయ గౌరవ్ దివస్ ప్రాముఖ్యత గురించి ఇంకా ఎంతో తెలుసుకోవాలని తుడుం దెబ్బ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, ఆదివాసి సేన మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మడావి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పెంద్రం శంకర్, తుడుం దెబ్బ కాసిపేట మండల అధ్యక్షుడు సంద్ర భూమన్న, ఆత్రం సంజీవ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం / కౌటాల :** ఆదివాసీ ముద్దుబిడ్డ, ఉద్యమకారుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను శనివారం కౌటాల మండలంలోని వీర్ధండి గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టుమని పాతికేళ్ళు రాక ముందే ఆంగ్లేయులపై పిడికిలి బిగించిన ఆయన ధైర్య సాహసాలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం నవంబర్ 15వ తేదీని జన జాతీయ గౌరవ్ దివస్గా ప్రకటించింది. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్, రాజ్ గోండ్ సేవా సమితి మండల అధ్యక్షులు పెందోర్ రాజు, మడావి నాగార్జున, మాజీ ఉప సర్పంచ్ పర్చాకే బందు, నాయకులు పర్చాకే రాంచందర్, సిడాం నారాయణ, మడపతి మారుతి, సిడాం సుధాకర్, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధికారులు పాల్గొని బిర్సా ముండా జీవితం, ఆయన తెగల హక్కుల కోసం సాగించిన పోరాటాన్ని స్మరించారు. ఆయన ఆలోచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని వారు తెలిపారు.

## సింగరేణి అధికారులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి కాలరీస్ బిసి ఓబిసి ఎంప్లాయీస్ అసోసియేషన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కొత్తగూడెం నుండి బదిలీపై వచ్చి నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన లా ఆఫీసర్ మల్లేష్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) సుమలత లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. బిసి అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి బద్రి బుచ్చయ్య, కోశాధికారి మల్లేష్, పిట్ కన్వీనర్ మహేష్, సభ్యులు సందీప్, రామ్ చందర్, ప్రసాద్, నరేష్, నాగలక్ష్మి , సంధ్య పాల్గొన్నారు.

# సిర్పూర్ కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

### 247 కేసులకు పరిష్కారం, 3,19,300 జరిమానా వసూలు

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి కోర్టు ప్రాంగణంలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం అధ్యక్షతన ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రజలకు వేగవంతమైన, సులభమైన న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని వారు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో మొత్తం 247 కేసులు విచారణకు వచ్చి పరిష్కారం పొందాయి. ఇందులో రాజీ కేసులు 21, అడ్మిషన్ కేసులు 226 (సిసి 74, ఎస్‌టిసి, 152) ఉన్నాయి. జరిమానాల రూపంలో సిసి కేసులలో 2,37,350, ఎస్‌టిసి కేసులలో 81,950 వసూలయ్యాయి. మొత్తం జరిమానా 3,19,300 వసూలైంది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కిషోర్ కుమార్, పి సతీష్ కుమార్, జి కళ్యాణ్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.



## అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన ఎస్ఐ, సిబ్బంది



**ప్రజాపక్షం / కాసిపేట :** దేవాపూర్ పోలీసుల అప్రమత్తత ఒక ప్రా ణాన్ని కాపాడింది. శనివారం ఉదయం సుమారు 8 గంటల స మయంలో కాల్వల తిరుపతి అనే వ్యక్తి తన భార్యతో గొడవపడి ఇంటి నుండి వెళ్ళిపోయాడు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో అతని పెద్ద కుమారుడు దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే సబ్ ఇన్స్పెక్టర్ గంగారం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శోధన చర్యలు ప్రారంభించారు. కేవలం ఒక గంట వ్యవధిలోనే తిరుపతి దేవాపూర్‌లోని సల్పల వాగు సమీప అటవీ ప్రాంతంలో ఉన్నాడని గుర్తించారు. వెంటనే సి బ్బందితో అక్కడికి చేరుకున్న పోలీసులు, తిరుపతిని ఒక చెట్టు కింద అపస్మారక స్థితిలో పడి ఉండగా గుర్తించారు. ఆలస్యం చేయకుం డా పోలీసులు అతడిని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. వేగవంతమైన స్పందనతో తిరుపతి ప్రాణాపాయ స్థితి నుండి బయటపడినట్లు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో న్యాయమూర్తి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలంలో గల గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వర స్వామిని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జక్కుల అనంతలక్ష్మి శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు వెంకటేశ్వర స్వామి చరిత్రను ఆమెకు తెలిపారు. తీర్థ ప్రసాదాలు అందజేసి మర్యాదపూర్వకంగా న్యాయమూర్తిని ఆలయ అర్చకులు శాలువాతో సత్కరించారు. ఆమె వెంట కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వై.ఎస్.ఆర్ కాలనీ సమస్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాడు చలావ్ యాత్ర

### తక్షణ పరిష్కారానికి డిమాండ్..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా ఆమ్ అద్మీ పార్టీ(ఆప్)ఆధ్వర్యంలో ఈరోజు వై.ఎస్.ఆర్ కాలనీలో జాడు చలావ్ యాత్ర నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ నేతృత్వంలో ముఖ్య నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.యాత్ర సందర్భంగా కాలనీలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం,మురుగునీటి నిల్వ కారణంగా మలేరియా,డెంగ్యూ వంటి అంటువ్యాధులు ప్రబలడం వంటి తీవ్ర సమస్యలు వెలుగులోకి వచ్చాయి.సుమారు 20 మంది కాలనీవాసులు ఇప్పటికే రోగాల బారిన పడినట్లు ఆప్ నాయకులు గుర్తించారు.సరైన పారిశుధ్ద్యం లేకపోవడం,గండి రామన్న గుట్టల నుంచి వచ్చే వరద కారణంగా కాలనీ ముంపునకు గురవుతుండటం కూడా ప్రధాన సమస్యలుగా స్థానికులు తెలిపారు.ఈ మేరకు త్వరలోనే మున్సిపల్ కమీషనర్,జిల్లా కలెక్టర్ గార్లకు వినతి ప్రతం అందజేయనున్నట్లు సయ్యద్ హైదర్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్,కార్యదర్శి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## వడ్లు కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు మొర

**ప్రజాపక్షం/హత్నూర:**మా వడ్లు కొనుగోలు చేయాలని సిరిపురం గ్రామ రైతులు జిల్లా కలెక్టర్‌కు మొర పెటుకున్నారు. వీరు మొనటి వరకు వచ్చిన తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వడ్లు కొన్ని మొలకెత్తగా ,మరికొన్ని పూర్తిగా తడసి పోవడం జరిగిందని తెలిపారు. మొలక లెత్తిన దాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయడం లేదని ఆ దాన్యాన్ని కొనుగోలు చేసే విదంగా చూడాలని శనివారం సంగారెడ్డి కలెక్టర్ ను సిరిపురం రైతులు కోరారు . ఈ సందర్భంగా వారు తడిసిన దాన్యం మొలకలోచిన వడ్లు మా నుండి కొనుగోలు చేయకుంటే మా బతుకులు రోడ్డున పడతాయని ఎలాగైనా మా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలో మా దాన్యాన్ని తీసుకోవడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామ రైతులున్నారు.

## 17 నుండి పత్తి కొనుగోళ్లు బంద్

**ప్రజాపక్షం/భూపాలపల్లి** :భారత పత్తి సంస్థ (సిసిఐ) పత్తి జిన్నింగ్ మిల్లుల విషయంలో విధించిన నిబంధనలను సడలించే వరకు ఈ నెల 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సిసిఐ కొనుగోళ్లు, ప్రయివేట్ కొనుగోళ్లు పూర్తిగా నిలుపుదల చేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని రైతులందరూ ఈ విషయాన్ని గమనించి, సోమవారం నుండి అనగా 17 నుండి రైతులెవరూ పత్తి జిన్నింగ్ మిల్లులకు తమ పత్తిని తీసుకురావద్దని తెలియచేశారు. సిసిఐ కి పత్తి అమ్ముకునే రైతులు, తమ స్లాట్ బుకింగ్ చేసుకున్న కూడా పత్తి తీసుకు రావద్దని సూచించారు. కొనుగోళ్ల విషయంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రైతులు పత్తిని అమ్మకానికి తీసుకు రావద్దని ఆయన తెలిపారు.

## పశువులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**పశువులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. శనివారం అక్రమంగా పశువులను తరలిస్తున్నరనే సమాచారం మేరకు మండలంలోని అంబట్ పల్లి గ్రామ శివారులో పట్టుకుని వారివద్దనుండి 8 ఎద్దులు,లేగదూడపు స్వాధీనం చేసకున్నట్లు తెలిపారు.కాటారం, దేవాదుల,బిట్టుపల్లి గ్రామాలకు చెందిన వారనితెలిపారు.వారిపైకేసునమోదుచేసిద ర్యాప్తుచేస్తున్నట్లుఎస్ఐపవన్‌కుమార్‌తెలిపారు.

## కోతుల,కుక్కల బెడదను నివారించాలని కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/భూపాలపల్లి:**భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న టి2 క్వార్టర్స్ లో కోతుల, పందుల, కుక్కల బెడదను నివారించాలని కోరుతూ, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు నూకల చంద్రమౌళి భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# నేడు సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ

### సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ అనంద్



**ప్రజాపక్షం/సంగారెడ్డి:**సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సాహ ముగింపు సభ సందర్భంగా నేడు నారాయణ ఖేడ్ కు బస్సు యాత్ర రాక నిర్వహిస్తున్నట్లు సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ అనంద్ తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26 న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ ఉద్దేశించి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించి సిపిఐ పార్టీ ఇంటింటా గొంతును తీసుకెళ్లడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా నేడు నారాయణఖేడ్‌లో బస్సు యాత్ర నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవలని పార్టీ నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాత నిర్వహించుకోవడం జరుగుతుందని ఇంటికి ఒక మనిషి ,ఊరుకో బండి అనే పద్దతిలో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకుంటూ ఈ యాత్ర కొనసాగుతుందని అన్నారు. అందులో భాగంగానే మెదక్ నుండి నారాయణఖేడ్ కు విచ్చేస్తున్న బస్సు యాత్రకి పార్టీ కార్యకర్తలు నాయకులు , సానుబూతి పరులు శ్రేయోభిలాషులు బస్సు యాత్రకి స్వాగతం పలికి అంబెద్కర్ చౌక్ వద్ద సమావేశం విజయవంతం చేయవలసిందిగా పిలుపుని చ్చారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీగా దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆర్షించే దగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులుచిరంజీవి ,అశోక్, సతీష్, ప్రేమ్ పాల్గొన్నారు.

# సంకల్ప సిద్ధికి కార్తీకదీపం దోహదం



**ప్రజాపక్షం/గజ్వేల్:**సంకల్ప సిద్ధికి కార్తీకదీపం దోహద పడనుండగా, తేజోవంతమైన కార్తీకదీపం వెలిగిస్తే ఆ కుటుంబంలో శాంతి, ధనవృద్ధి, ఐశ్వర్యం, మోక్షం, సకల సంపదలతో తులతూగుతుందని శ్రీ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. వర్గల్ క్షేత్రం వద్ద శనివారం సాయంత్రం జరిగిన కార్తీక దీపోత్సవం సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో స్వామివారిని అర్చిస్తే అంతా మంచే జరుగుతుందని, అలాగే కార్తీక వెలుగులతో అజ్ఞానాందకారం తొలిగి జ్ఞానం సిద్ధిస్తుందని తెలిపారు. ఈ మహిమాన్విత మాసంలో ఈశ్వర ఆరాధన చేస్తే జన్మజన్మల పాపాలు తొలగి అనంతమైన పుణ్య ఫలాలు సిద్ధిస్తాయని, అంతేకాకుండా దీపారాధనతో పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతాన మల్లికార్జున క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ, డాక్టర్ హరినాథ శర్మ మాట్లాడుతూ సత్సంకల్పంతో ఆనందమయ జీవితం గడపవచ్చని, ముఖ్యంగా మోక్షమార్గానికి దిక్సూచిగా పుణ్య స్థలాలు, పురాతన క్షేత్రాలు మార్గదర్శకం కల్పిస్తాయని స్పష్టం చేశారు. అంతేగాకుండా ఆధ్యాత్మిక శిఖరంగా సిద్ధాంతి శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నిలుస్తుండగా, లోక కళ్యాణార్థమై నిర్వహించిన ఈ కార్తీకదీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు అంతా మంచే జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, ఆర్డీవో చంద్రకళ పాల్గొన్నారు.

# వివిధ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్



**ప్రజాపక్షం /సంగారెడ్డి** :శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పటాన్‌చెరు, జహిరాబాద్ పట్టణాల్లోని వివిధ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజల శాంతి భద్రతలే ప్రథమ కర్తవ్యము అని జిల్లా వ్యాప్తంగా ప్రజా శాంతికి భంగం కలిగించే ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా కమ్యూనిటీ కాంటాక్ట్ నాకాబంధీ వంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల వీకర్ సెక్షన్ కాలనీ రామేశ్వరం బండా గ్రామంలో ఇతర జిల్లాలకు ,రాష్ట్రాలకు చెందిన వలసదారులు అధిక సంఖ్యలో నివాసముంటున్నారని ,వివిధ రాష్ట్రాల ,జిల్లాలకు చెందిన వ్యక్తులు నివసించడం వలన నేరస్తులు తల దాచుకొనే అవకాశం ఉంటుందని ,ఈ ప్రదేశంలో దొంగిలించిన ఆస్తులు అనుమానస్పద వస్తువులు నిల్వ చేయడానికి అవకాశం ఉంటుందని పటాన్‌చెర్వు డిఎస్పీ ప్రభాకర్ ఆద్వర్యంల సుమాఉ 220 మంది పోలీసులతో మొత్తం కాలనీని 4 బాగాలు అవుటర్ కార్డన్లు, హోల్టింగ్ పాయింట్ కట్ ఆప్ పాయింట్లు శోదనా బృందాలుగా విభజించి ఈ రోజు తేది 15.11. 2025 నాడుఉదయం 4.30 గంటలకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సర్చ్‌లో 205 అనుమానితులను పాపిలాన్ డివైజ్ ద్వారా పరిక్షించి అందులో 4,వ్యక్తులు, గతంలో నేర చరిత్ర గల వ్యక్తులను గుర్తించడం జరిగింది. 62మోటర్ సైకిళ్లు, 17 ఆటోలు, ఒక కారు అనుమానాస్పదంగా స్వాదీనం చేసుకొని 15 వాహనాలకు జరిమానా విధిస్తూ 17వాహనాల పెండింగ్ చలాన్లు క్లియర్ చేయించడం జరిగిందని తెలిపారు.

# శివలింగ నవగ్రహ ప్రతిష్టాపన వేడుకలు

**ప్రజాపక్షం/గణపురం:**గణపురం మండల కేంద్రం లోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న గణపతి, శివలింగ, నవగ్రహ, అష్టబలిపీఠ ప్రతిష్ఠాపనతో పాటు కుంభాభిషేక మహోత్సవాలు రెండవ రోజు శనివారం ఘనంగా కొనసాగాయి. ఆలయ ప్రాంగణం శివనామస్మరణలతో, హరినామ గోషాలతో మారుమ్రోగింది. తెల్లవారుజామునే వేదపండితులు మంగళ వాద్య నాదాలతో నిత్య హోమాదులను ప్రారంభించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులకు అష్టోత్తర శతకలశ కుంభాభిషేకం నిర్వహించగా, విగ్రహ మూర్తులకు దాన్యసేనాది వాసం వేడుక ఎంతో వైభవంగా జరిగింది. సహస్రలింగార్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. నేడు ఉదయం 6 గంటలకు గణపతి, నవగ్రహ, శివలింగ, అష్టబలిపీఠ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాల అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల రాకపోకలకు, సకల ఏర్పాట్లకు వాలంటీర్లు కృషి చేస్తున్నారు. ఆలయం చుట్టుపక్కల విద్యుత్ దీపాల అలంకరణతో కనువిందు చేస్తున్నాయి.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారుల పరిశీలన



**ప్రజాపక్షం /కొండాపూర్** : కొండాపూర్ మండల పరిధిలోని గంగారం గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకై విద్యుత్ జిల్లా విద్యుత్ అదికారి లక్ష్మణ్ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. అనంతరం ప్రజలతో కలిసి గ్రామంలో సమస్యలను నేరుగా పరిశీలన చేసి దిగువ అధికారులకు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రదానమైన సమస్య ట్రాన్సార్మర్ ఇండ్ల మధ్యలో ఉండడంతో మనుషులకు ప్రమాదకరంగా మారి పశువులు మృతి చెందుతున్నాయని తెలిపారు. వెంటనే ట్రాన్స్ఫార్మర్ షిఫ్ట్ చేయాలని ,పాత స్తంబాలను మార్చాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారి వీరారెడ్డి మండల విద్యుత్ అధికారి సిద్ధ లైన్మన్ హాలీం ,స్థానిక గ్రామ యువకులు పాల్గొన్నారు.

## లింగంపల్లి గురుకుల పాఠశాలలో స్కాట్ ,గైడ్స్ ముగింపు ఉత్సవాలు

**ప్రజాపక్షం/మునిపల్లి** :జిల్లాలోని మనిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్కాట్స్ ,గైడ్స్ శిక్షణ తరగతుల ముగింపు ఉత్సవాలు జరిగాయి. విద్యార్థులు వారం రోజుల పాటు నేర్చుకున్న నైపుణ్యాలను ప్రతిభావంతంగా ప్రదర్శించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు సీఎంఓ వెంకటేశం మునిపల్లి మండల విద్యాధికారి బీమ్ సింగ్ తెలంగాణ రాష్ట్ర స్కాట్స్ ,గైడ్స్ కమీషనర్ మోహన్‌రావు, భారత మాతాజీ అమర జ్యోతి జిల్లా స్కాట్స్ ,గైడ్స్ కార్యదర్శి మాదవ రెడ్డి, జిల్లా కమీషనర్ అంజ గౌడ్, హాజరై కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రిన్సిపాల్ సురభి చైతన్య మాట్లాడుతూ స్కాట్ గైడ్స్ శిక్షణ శిక్షణ సేవాబావం , నాయకత్వం వంటి ముఖ్య గుణాలను పెంపొందిస్తుందన్నారు. మా విద్యార్థులు ఈ శిక్షణ లో చూపించన నిబద్ధత ప్రశంసనీయమన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ సేవ కు సమాజ సేవకు దార చూపే విలువలు స్కాట్స్ ,గైడ్స్ ద్వారా విద్యార్థులో ఏర్పడడం అత్యంత అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సందర్భంగా డ్రిల్ పస్ట్ ఎయిడ్ నైపుణ్యాలు అత్యవసర పరిస్థితులో స్పందించే పద్ధతులు కాంపింగ్ నైపుణ్యాలు సమాజసేవ చర్యలు వంటి అంశాలను ఆద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని అద్యాపకులుస్కాట్స్ ,గైడ్స్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

## శరవేగంగా ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**ప్రజాపక్షం/నర్సాపూర్:**తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. ఈ ఆన్‌లైన్ ప్రక్రియను ఉపయోగించుకొని కార్యదర్శులు సభ్యత్వాన్ని త్వరితగతిన పొందాలని ఫోరం జిల్లా కార్యదర్శి కాయితి సంతోష్ కార్యదర్శులకు పిలుపునిచ్చారు. ఈ రోజు జిల్లాలోని శివంపేట మరియు నర్సాపూర్ మండలాల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టిఎన్‌జిఓస్ నర్సాపూర్ యూనిట్ అధ్యక్షుడు మరియు ఎస్‌డబ్ల్యూఒ ఫోరమ్ అధ్యక్షులు శేషాచారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారు సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి, కార్యదర్శులకు సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా శేషాచారి మాట్లాడుతూ, సంస్థాగత బలం కోసం సభ్యత్వం తప్పనిసరని నొక్కి చెప్పారు. మిగిలిన మండలాల్లోని కార్యదర్శులు కూడా ఎలాంటి జాప్యం చేయకుండా త్వరగా ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వాన్ని పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శివంపేట, నర్సాపూర్ మండలాల పంచాయితీ కార్యదర్శులు పాతూరి రవి, ప్రవీణ్, శ్రీనివాస్, దేవేందర్, చంద్రశేఖర్, బషీర్, జి.రమేష్, ఏ.సంతోష్ కుమార్, జె.రాఘవేంద్ర, ప్రమోద్, యుగంధర్, రాజు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.